
క్లుప్తంగా

గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

ఆత్మకూరురూరల్: భారత ప్రభుత్వ సూచనల మేరకు గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆత్మకూరు పట్టణంలోని గౌరీశంకర్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు గంగాధరరెడ్డి ఆదివారం విజ్ఞప్తి చేశారు. గ్యాస్ వినియోగదారులందరు ముఖ గుర్తింపు లేదా వేలి ముద్ర స్కానర్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మొబైల్‌లో ఓటీపీ ద్వారా భద్రత తనిఖీని పొందాలని సూచించారు. ఇందుకోసం ఎవరికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈకేవైసీ ప్రభుత్వ ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలిండర్లకు కూడా అవసరమవుతుందని ఆయన పేర్కొన్నారు.

గుత్తులుగా పనస కాయలు



స్మృతివనంలో కాసిన పనస కాయలు

ఆత్మకూరురూరల్: సహజంగా కొన్ని రకాల ఫలాలనిచ్చే వృక్షాలు పరిమితమైన ప్రాంతాల్లో మాత్రమే మన్నగలుగుతాయంటారు. ఉదాహరణకు ఆపిల్ పండ్లు కశ్మీర్, హిమాచల ప్రదేశ్ లాంటి శీతల ప్రదేశాలలో మాత్రమే కాస్తాయి. అలాగే పనస మన రాష్ట్రంలోని ఉత్తరాంధ్రలో మాత్రమే కాస్తుంది. కానీ చిత్రంగా ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామ శివార్లలో ఉన్న వైఎస్సార్ స్మృతివనంలో పనస చెట్టు ఏపుగా పెరగడమే కాకుండా గుత్తులు గుత్తులుగా కాయలు కాశాయి. పనస చెట్టు మొదలుకు కాసిన పనస పండ్ల గుత్తులను సందర్శకులు అబ్బురంగా చూస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యద్భుతంగా నిర్వహించబడుతున్న వైఎస్సార్ స్మృతివనంలో పనస చెట్టే కాక పలుజాతుల ఫల, పుష్పల మొక్కలు, చెట్లు ఉన్నాయి. సుమారు 560 రకాల జాతులు ఉన్నట్లు అక్కడి నిర్వాహకులు చెబుతున్నారు.

పాఠశాలలకు గ్రీన్‌చాక్ బోర్డుల మంజూరు



పాఠశాలలకు గ్రీన్‌చాక్ బోర్డులు సరఫరా చేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు గ్రీన్‌చాక్ బోర్డులు మంజూరైనట్లు ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 8 ఉన్నత పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు, 27 ప్రాథమిక పాఠశాలలున్నాయన్నారు. వాటిలో గతేడాది కొన్ని పాఠశాలలకు గ్రీన్‌చాక్ బోర్డులు మంజూరు కాగా మిగిలిన పాఠశాలలకు 150 గ్రీన్‌చాక్ బోర్డులు వచ్చాయని తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వెలుగోడు: పట్టణంలోని శ్రీ సమర్థ సద్గురు సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. కాడగ హారతి, రుద్రాభిషేకం, విష్ణు సహస్ర పారాయణం, గణపతి పూజ, పుణ్యావచనం, కలశ స్థాపన చేశారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం పల్లకీ సేవ, శేజ్ హారతి నిర్వహించారు.

నేడు విత్తనాల పంపిణీ

ఆత్మకూరు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం రైతులకు విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతులకు జీలుగ, పెసర తదితర విత్తనాలను సబ్సిడీపై అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేసు నమోదు

మహానంది: మహానందిలోని ఈశ్వర్ నగర్ కాలనీకి చెందిన నాసరి విజయ్‌పై అదే కాలనీకి చెందిన సుర సుర సూరి, ఆయన కుమారుడు శాంత కుమార్ శనివారం రాత్రి దాడికి యత్నించినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మహానంది ఎస్‌ఐ జి. నాగేంద్ర ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ నాసరి విజయ్, సూరి మధ్య గతంలో గొడవలు ఉన్నాయని అన్నారు. తాజాగా స్థల వివాదం విషయంలో విజయ్‌పై సుర సుర సూరి, ఆయన కుమారుడు శాంత కుమార్ మారణాయుధాలతో దాడికి యత్నించినట్లు విజయ్ ఫిర్యాదు చేయడంతో సూరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం

తన తండ్రిని బయటికి పంపించాలని సూరి కుమారుడు శాంతకుమార్ పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. పోలీస్ స్టేషన్ పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్‌ఐ మాట్లాడుతూ సుర సుర సూరిపై 11 కేసులు, శాంత కుమార్ పై 7 కేసులు ఉన్నాయన్నారు. శాంత కుమార్‌పై రౌడీ షీట్ కూడా ఉందన్నారు. పోలీసులను బెదిరించేందుకే ఆత్మహత్యాయత్నం చేశాడని చెప్పారు.

జోరుగా సాగుతున్న ఏరువాక

- డివిజన్ పరిధిలో విస్తారంగా వర్షాలు
- పొలం పనుల్లో రైతన్నలు నిమగ్నం
- అధికంగా మొక్కజొన్న, పత్తి, కంది పంటల సాగు



ఆత్మకూరు సమీపంలో విత్తు పనుల్లో వ్యవసాయ కూలీలు

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో మే నెల నుంచి ముందస్తు వర్షాలు విస్తారంగా కురవడంతో రైతులు ఇప్పటికే పొలాలను చదును చేసి నాగళ్లతో దుక్కులు దున్ని విత్తు వేసేందుకు సిద్ధంగా ఉంచారు. ఏరువాక పౌర్ణమి రావడంతో రైతులు ఆనందంగా పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వృషభాలు, ట్రాక్టర్లతో పొలాలను చదును చేస్తూ, విత్తు వేస్తూ భూమిని నమ్ముకుని కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు ఉపక్రమించారు. ఈ ఏడాది మొక్కజొన్న సాగుపైనే రైతన్నలు ఎక్కువ దృష్టి సారించారు. అలాగే పత్తి, కంది పంటలు కూడా వేస్తున్నారు.

జోరుగా విత్తనాలు

ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌కు రైతులు జోరుగా పంటలు సాగు చేస్తున్నారు. వాణిజ్య పంటలైన మొక్కజొన్న పంటవైపే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. పత్తి, కంది పంటలు కూడా వేసేందుకు సిద్ధమయ్యారు. వీటికి తోడు చెరువుల కింద మెట్ట వరి పంటను వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. సాధారణంగా ప్రతిఏడాది మెట్ట వరి పంట ఆత్మకూరు మండలంలో 2,250 హెక్టార్లలో, వెలుగోడు మండలంలో 3,086 హెక్టార్లలో, పాములపాడు మండలంలో 560 హెక్టార్లు, కొత్తపల్లిలో 1390 హెక్టార్లలో కలిపి దాదాపు 7 వేల హెక్టార్లకు పైగా సాగుచేస్తారు. ఈ ఏడాది దీని కంటే మొక్కజొన్న పంటను అధికంగా రైతులు సాగు చేస్తున్నారు. ఆత్మకూరు మండలంలో 4,800 హెక్టార్లలో, వెలుగోడు మండలంలో 1069 హెక్టార్లు, పాములపాడు మండలంలో 6,500 హెక్టార్లు, కొత్తపల్లిలో 4,900 హెక్టార్లలో ఈ పంటను వేస్తున్నారు. దాదాపు 16 వేల హెక్టార్లలో మొక్కజొన్న పంటను రైతులు సాగుచేయనున్నారు. ఇదే స్థాయిలో పత్తి 408 హెక్టార్లు ఆత్మకూరు మండలంలో కాగా, డివిజన్ పరిధిలో 3 వేల హెక్టార్లలో పంట వేయనున్నారు. వీటితో పాటు కంది, మిర్చి పంటలపై కూడా రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం డివిజన్‌లో ఈ పంటలు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

30 శాతానికి పైగానే విత్తు వేసిన రైతన్నలు

డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో 30 శాతానికి పైగానే రైతులు విత్తు వేశారు. ఇప్పటికే మొక్కజొన్న, పత్తి, కంది, మిరప పంటలు విస్తారంగా విత్తు వేస్తుండగా వర్షం అనుకూలించకపోవడంతో చాలా పొలాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ రకాల విత్తనాల కొనుగోలుతో పాటు ఎరువులను కొనుగోలు చేసి విత్తు వేసేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. కాస్త ఎండలు కాసి పొలాల్లో నీరు ఎండిపోతే 70 నుంచి 80 శాతం వరకు విత్తు వేసేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు.



విత్తు వేస్తున్న రైతులు, మహిళలు

మొక్కజొన్నను సాగు చేశా



పొలాల్లో ఇప్పటికే మొక్కజొన్న పంటను విత్తు వేశాం. వర్షాలు జోరుగా కురవడం వల్ల వ్యవసాయ పనులు ఆలస్యమవుతున్నాయి. ఆరిన పొలాల్లో విత్తు వేశాం. వరుణుడు కాస్త కనుకరించి వర్షానికి విరామమిస్తే విత్తు వేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– రాజు, శ్రీపతిరావుపేట రైతు

మంచి వర్షాలు కురుస్తున్నాయి



నల్లమల అటవీప్రాంతంలోని అన్ని గ్రామాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రైతులకు చాలా అనుకూలంగా ఉండడంతో మెట్ట వరిపంట వేసేందుకు రైతులకు అనుకూలంగా ఉంది. ప్రధానంగా ఈ ఏడాది రైతులు మొక్కజొన్న పంటవైపే దృష్టి మళ్లించారు. ఇప్పటికే పలుచోట్ల రైతులు విత్తు వేస్తున్నారు. మరో రెండు, మూడు రోజులు వర్షాలు కురకపోతే విత్తు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేశాం.

– శివశంకర్‌నాయక్, ఎస్.ఎన్.తండా రైతు



పాలెంచెరువు సమీపంలో ట్రాక్టర్‌తో వరి విత్తనం వేస్తున్న రైతన్న

విత్తు పనుల్లో రైతన్నలు

కొత్తపల్లి: గత వారం వర్షాలు పడి ఒరుపివ్వడంతో మండలంలో రైతన్నలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ముందస్తుగా కొంత మంది రైతులు ఆరుతడి పంటలైన పత్తి, మొక్కజొన్న వంటి సాగు చేసుకుంటున్నారు. మరికొందరు రైతులు మెట్ట వరిసాగు చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. పొలాలను దున్ని, సేద్యం చేసుకొని విత్తనాలు వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. మండలంలోని గువ్వలకుంట్ల, బండినాయినిపాలెం, వీరాపురం, కొత్తపల్లి రైతులు కాడెద్దులు, ట్రాక్టర్లతో వరి విత్తనాలు వేస్తున్నారు. వరి విత్తనాలు వేసుకునేందుకు మంచి అదును కావడంతో విత్తనాలు వేసే పనిలో కర్షకులు మునిగితేలుతున్నారు. అదేవిధంగా మండలంలోని బావాపురం, నందికుంట, దుద్యాల, లింగాపురం, శివపురం, పెద్దగుమ్మడాపురం, సింగరాజుపల్లె, ఎదురుపాడు, గోకవరం, కొక్కెరంచ గ్రామాల రైతులు అదునుకోసం ఎదురు చూస్తూ పత్తి, మొక్కజొన్న విత్తనాలు నాటే పనిలో పడ్డారు. వర్షాలు ఒరుపు ఇవ్వడంతో వ్యవసాయకూలీలకు కాస్తా ఉపాధి లభించినట్లు అయింది.



నందికుంట సమీపంలో పత్తివిత్తనాలు నాటుతున్న వ్యవసాయ కూలీలు

రైతుల ఆత్మహత్యలను నివారించాలి

నందికొట్కూరు: రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం ఎదుట ఏపీ రైతు సంఘం ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఏ ఒక్క రైతు ఆత్మహత్య చేసుకోకుండా నివారించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు వెంటనే ఆచరణ అమలు చేయాలన్నారు. ఇటీవల మిడుతూరు మండల పరిధిలోని దేవనూర్‌లో పింజరి రఫి, కొత్తపల్లి మండల పరిధిలోని సింగరాజుపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటరమణ ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. టీడీపీ పాలన ప్రారంభంలోనే రైతులు ఆత్మహత్యకు పాల్పడిన కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు ఏసు, కృష్ణయ్య, లక్ష్మన్న, సామన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీశైలం రానున్న తెలంగాణ డిప్యూటీ సీఎం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం శ్రీశైలం రానున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా శ్రీశైలం చేరుకుంటారు. ఉదయం 11గంటలకు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారు. దర్శనం అనంతరం తెలంగాణ ప్రాంతంలోని శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి, అనంతరం విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారు.

వేలాల్లో పెరిగిన ఆదాయం

మహానంది: బండిఆత్మకూరు మండలం భోజనం గ్రామంలోని శ్రీ ముక్తేశ్వరస్వామి ఆలయానికి చెందిన 40.72 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూములకు గతేడాది నిర్వహించిన వేలాల ద్వారా రూ.10,31,500 రాగా.. ఈ ఏడాది రూ.14,08,000 ఆదాయం వచ్చినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.3,76,500 అదనంగా వచ్చిందన్నారు. గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ శశికుమార్, రైతులు పాల్గొన్నారు.

అతిసారం బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



వైద్యశిబిరంలో చికిత్సపొందుతున్న బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర

జూపాడుబంగ్లా: చాబోలులో అతిసారం వ్యాధి ప్రబలి నడిపి నాగన్న అనే వ్యక్తి మృతిచెందిన విషయం తెలుసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నాయకుడు మాండ్ర శివానంద రెడ్డి ఆదివారం గ్రామంలో పర్యటించారు. ముందుగా నడిపి నాగన్న పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. నడిపి నాగన్న మృతికిగల కారణాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శించారు. అతిసారం వ్యాధి బారిన పడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు యశశ్విని, నాగేంద్ర లకు సూచించారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ గ్రామంలో అతిసారం వ్యాధి ప్రబలడానికి కారణమైన సర్పంచ్ పల్లెనిర్మలమ్మపై కేసునమోదు చేయించటంతో పాటు చెక్‌పవర్ రద్దు చేయిస్తామని తెలిపారు. పక్షం రోజులకో పర్యాయం గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు, డ్రైనేజీలు శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో మాట్లాడి మృతుడు నడిపి నాగన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ కాంతారావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య నగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి

ఆత్మకూరు: పట్టణంలోని ఏకలవ్య నగర్‌లో గత 9 రోజులుగా నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు ఎ.సురేంద్రలు డిమాండ్ చేశారు. ఆదివారం ఏకలవ్యనగర్ కాలనీవాసులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఏకలవ్యనగర్‌లో దాదాపు 9 రోజుల నుంచి కుళాయిలకు నీరు రావడం లేదన్నారు. దీంతో కాలనీవాసులు ప్రైవేట్ వ్యాపారుల నుంచి నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. రూ.10కు రెండు బిందెలు, డ్రమ్ముకు రూ.50 చొప్పున చెల్లించి నీటిని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు దాసమ్మ, రమణ, కాలనీ ప్రజలు స్వర్ణ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

శ్రీశైల దేవస్థానం ఉద్యోగులకు పదోన్నతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పదోన్నతులు కల్పించినట్లు శ్రీశైల దేవస్థాన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం ఉద్యోగులకు పదోన్నతుల ఉత్తర్వులు ఈఓ అందజేశారు. రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాసులు, ఎస్.లోకేశ్వరప్ప, కె.అనురాధ, వి.వెంకటలక్ష్మిలకు జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. అలాగే అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.మహేష్ నాయక్‌కు రికార్డ్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన ఈఓ కు ఉద్యోగుల తరుపున ఆ సంఘం అధ్యక్షుడు ధన్యవాదాలు తెలియజేశారు.



వెంకటలక్ష్మికి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి ఉత్తర్వులను అందజేస్తున్న ఈఓ

మొక్కజొన్న పంటకు ఉడతల బెడద



పొలంలో మొక్కజొన్న మొక్క వద్ద ఉడతలు చేసిన రంధ్రం



ఉడతలు విత్తనం తినడంతో విరిగిన మొక్కను చూపుతున్న రైతు

పాములపాడు: విత్తనం నాటిన నుంచి పంట చేతికందే వరకూ రైతుకు పోరాటం తప్పదు. ప్రకృతి విపత్తులు, తెగుళ్లు, క్రిమికీటకాల బారి నుంచే కాపాడుకునేందుకు పురుగు మందులు పిచికారీ చేయడం పారిపాటిగా మారింది. ప్రస్తుతం ఖరీఫ్‌లో మొక్కజొన్న పైరును సుమారు 600 హెక్టార్లలో సాగు చేశారు. ప్రస్తుతం విత్తనం మొలకెత్తి రెండు ఆకులతో మొక్కజొన్న కర్రలున్నాయి. అయితే విత్తనం వేసిన నాటి నుంచే ఉడతల బెడద ఎక్కువైంది. ఉడతలు మొలకెత్తని విత్తనాలను, మొలకెత్తిన మొక్కలను తినేస్తున్నాయి. భూమిలోకి రంధ్రాలు చేసి విత్తనాలను ఆరగిస్తున్నాయి. కొందరు రైతులు వీటిని అరికట్టేందుకు రసాయన మందును వినియోగిస్తున్నారు. మరికొందరు వాటిని చంపడం బాగోదని, కేవలం ఆకలితోనే విత్తనాలు తింటున్నాయని భావించి బియ్యం, బొరుగులు పొలంలో చల్లుతున్నారు. భూమి పైన కనబడే బియ్యం, బొరుగులను తిని మొలకలకు నష్టం చేయవని రైతుల అభిప్రాయం.

ఉడతలతో పెద్దగా నష్టం ఉండదు

ఉడతల వల్ల పంటలకు ఎక్కువగా నష్టం ఉండదు. అవి కూడా ప్రకృతిలో ఒక భాగమే. మొక్కలను తక్కువ మోతాదులో తింటాయి. ఎలుకల మాదిరిగా ఎక్కువ నష్టాన్ని కల్గించవు. మొక్కలు కాస్త పెద్దవయితే పంటల జోలికి రావు.

–పత్తేశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి

కమనీయం... మహానందీశ్వరుడి కల్యాణం



మహానందీశ్వర దంపతులకు కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మహానంది: మహానందిలో శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర దంపతులకు కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, అర్చకులు హరికుమార శర్మలు స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగల్య ధారణ, అక్షతల సమర్పణ పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవల్లో పాల్గొని స్వామివారి కల్యాణం జరిపించారు.

మహానందిలో సండే సందడి



కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనం రాత్రి ఏకాంతసేవ సమయం వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తులు స్థానిక రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కొనేర్లలో పుణ్య స్నానాలు ఆచరించారు. సెలవు రోజు ఉండటంతో దేవస్థానం పరిధిలోని వసతి గృహాలకు డిమాండ్ పెరిగింది.

డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జి సేవలు మరవలేనివి



శ్యామ్ ప్రసాద్ ముఖర్జి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నందికొట్కూరు: జాతీయవాది, దేశ భక్తుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జి అందించిన సేవలు మరవలేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామోదరరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని చౌడేశ్వరి దేవాలయంలో 79వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే హిందూ మహాసభ అధ్యక్షుడిగా, ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తగా, 1947లో నెహ్రూ మంత్రి వర్గంలో పరిశ్రమల మంత్రిగా పని చేశారన్నారు. దేశంలో రెండు రాజధానులు, ఇద్దరు ప్రధానమంత్రుల విధానానికి వ్యతిరేకంగా రాజీనామా చేసి 1950లో జనసంఘ పార్టీని స్థాపించిన ఘనత ముఖర్జికే దక్కిందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు రామచంద్రుడు, కృష్ణయాదవ్, సంజీవరెడ్డి, రాజేశ్వరరెడ్డి, అశ్వనికుమార్, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జికి నివాళి

నందికొట్కూరు రూరల్ : డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జి దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుడని డాక్టర్ వీరం మురళీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జి చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సురేంద్రనాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చాకలి నాగయ్య, మౌలాలి, కిషోర్, తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకోవాలి

వెలుగోడు: భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి ప్రతాప్ అచారి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్యామా ప్రసాద్ ముఖర్జి త్యాగాన్ని స్మరించుకుంటూ పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీజేపీ వెలుగోడు మండలం అధ్యక్షుడు పాతుల రాజ శేఖర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నూలు నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు లబ్బి మధు, జిల్లా కార్యదర్శి మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలకు రెక్కలు



పాములపాడు వారపు సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

పాములపాడు: కూరగాయల ధరలు వింటేనే వినియోగదారులకు దిమ్మతిరుగుతోంది. ఆదివారం మండల కేంద్రంలోని వారపు సంతలో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ధరలు చూస్తుంటే మాత్రం పేద, మధ్యతరగతి ప్రజలు నోరెళ్లబెట్టాల్సిన పరిస్థితి దాపురించింది. కిలో కొనుగోలు చేయదలిచిన వారు అరకిలో తో సరిపెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. పచ్చి మిర్చి, బీరకాయ, కాకార కాయ ధరలు ఏకంగా కిలో రూ.120 చొప్పున ఉండటం వినియోగదారులకు మింగుడు పడటం లేదు. వారపు సంతలో కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట, ఆలు, క్యారెట్ ధరలు కిలో రూ.80ల చొప్పున, బెండకాయ, రూ.40, వంకాయ రూ.60, ఉల్లిగడ్డ రూ.50 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. ఇలాగే ధరలు కొనసాగితే ఇక కూరగాయలు తిన్నట్లేనని ప్రజలు వాపోతున్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- పార్టీ కార్యాలయాలు కూల్చడమే ప్రజాస్వామ్యమా?
- చెరువులు, పోరంబోకు స్థలాల్లో టీడీపీ ఆఫీసులు లేవా?
- ప్రశ్నించిన నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి
- మొదట ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని హితవు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

కర్నూలు (టౌన్): గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ప్రస్తుతం రజాకార్ల అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బివెంకటస్వామి అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి సంఘటనలు ఎక్కువయ్యాయన్నారు. కొందరు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. తాజాగా తాడేపల్లిలోని తమ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సైతం కూల్చారన్నారు. ఇది ప్రజాస్వామ్యమా..రాజకీయ కక్ష సాధింపు చర్యలా అని ప్రశ్నించారు. తెలుగుదేశం అరాచక పాలనను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఆదివారం సాయంత్రం లబ్బి స్థానిక గణేష్ నగర్‌లోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ' ప్రజలు మీకు అధికారం ఇచ్చింది ప్రతిపక్ష పార్టీ నాయకులను భయపెట్టడానికి, పార్టీ కార్యాలయాలను కూల్చడానికి కాదు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలును పక్కన పెట్టి చంద్రబాబు సర్కారు కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. గతంలో చెరువులు, పోరంబోకు స్థలాలు కబ్జా చేసి టీడీపీ కార్యాలయాలు నిర్మించింది నిజం కాదా? 2016లో తెలుగుదేశం ప్రభుత్వమే జీవో 21 ప్రకారం రాష్ట్ర స్థాయిలో 4 ఎకరాలు, జిల్లా స్థాయిలో 2 ఎకరాలు పార్టీ కార్యాలయాలకు అనుమతులు ఇచ్చింది. ఈ విషయం మరిచిపోతే ఎలా. కనీస మర్యాద పాటించకుండా స్పీకర్ ఎన్నిక సమయంలో సభా నాయకుడు, డిప్యూటీ సీఎం, హోంమంత్రి తదితరులు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. ప్రజలకు సంబంధించిన ఒక్క మాట కూడా సభలో మాట్లాడలేదు. ఎన్నికల ముందు పోస్టల్ బ్యాలెట్ ఓట్లన్నీ తెలుగుదేశం పార్టీకి వచ్చాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేయడం, అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం అధికారం కోసం పన్నిన కుట్ర కాదా' అని లబ్బివెంకటస్వామి ప్రశ్నించారు. టీడీపీ నాయకులకు సంయమనం పాటించాలని బయట చెప్పి, లోపల మాత్రం దౌర్జన్యాలు, దాడులు చేసే విధంగా చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇది మంచి పద్ధతి కాదని.. తీరు మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే తిరగబడుతారని హెచ్చరించారు. ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి రూ.2.70 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు.

సూపర్ సిక్స్ అమలుపై దృష్టి పెట్టండి

సూపర్ సిక్స్ హామీలైన సామాజిక పెన్షన్ పెంపుతో పాటు 50 ఏళ్లకే పెన్షన్, 18 ఏళ్ల పైబడిన మహిళలకు నెలకు రూ.1500, కుటుంబానికి 3 సిలిండర్లు, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం అమలుపై టీడీపీ దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే ఏపీలో శాంతి భద్రతలు అదుపుతప్పాయని, దాడులు, హత్యలు పెరిగాయన్నారు. బాపట్ల జిల్లాలో మహిళను రేప్ చేసి హత్య చేసినా చర్యలు లేవన్నారు. మహిళలకు రక్షణపై భరోసా ఇవ్వాల్సిన బాధ్యత సర్కారుపై ఉందన్నారు. విలేకరుల సమావేశంలో సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ నాయకులు కుర్షీద్ అహమ్మద్, మాజీ సర్పంచ్ మల్లికార్జున యాదవ్ పాల్గొన్నారు.